నేటి నుంచి బల్దియాలో ప్రత్యేకాధికారి పాలన

కార్పొరేషన్, జనవరి 28: కరీంనగర్ నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీ కాలం మంగళవారంతో ముగియడంతో బుధవారం నుంచి ప్రత్యేకాధికారి పాలన ప్రారంభం కానున్నది. ఇప్పటికే నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా, నగరపాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి పనుల విషయంలో అక్రమాలు, అవినీతి జరిగిందంటూ గత కొన్ని రోజులు ఆరోపణలు కొనసాగుతున్నాయి. మరోవైపు బీఆర్ఎస్, మేయర్ మధ్య సాగుతున్న మాటల యుద్ధంతో ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలంటూ ఇప్పటికే బీఆర్ఎస్ కార్పొరేటర్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తుండడం ఆసక్తిగా మారింది. అలాగే, మరోవైపు స్మార్ట్‌సిటీ పథకం కాల పరిమితి ఈ మార్చి నెలతో ముగియనున్నది. మరోవైపు నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగం, రెవెన్యూ విభాగాల పనితీరు, అక్రమాలపై విమర్శలు, ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. వీటిని గాడిన పెట్టాల్సిన పరిస్థితి ఉందని పాలకవర్గ సభ్యులే చెబుతున్నారు. టౌన్ ప్లానింగ్‌లో నెలల తరబడిగా భవన నిర్మాణ అనుమతులు పెండింగ్‌లో ఉంటున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వీటి విషయంలో ప్రత్యేకాధికారి ఎలాంటి చర్యలు చేపడుతారన్న విషయంపై ఆసక్తి నెలకొన్నది.

విలీన గ్రామాల రికార్డుల స్వాధీనానికి ఆదేశాలు

కార్పొరేషన్, జనవరి 28: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విలీనం చేసిన గ్రామాలు, మున్సిపాలిటీకి సంబంధించి పూర్తి రికార్డులు, మీనిట్ బుక్స్‌ను స్వాధీనం చేసుకోవాలని నగర కమిషనర్‌కు సీడీఎంఏ నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నగరపాలక సంస్థలో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు చింతకుంట, మల్కాపూర్, లక్ష్మీపూర్, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్ గ్రామాలు విలీనం కాగా, వీటికి సంబంధించిన ప్రత్యేకాధికారుల నుంచి మున్సిపల్ కమిషనర్ తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆయా కార్యాలయాల బోర్డులనూ మార్చాలని సూచించారు. ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీకి ఉన్న బ్యాంకు ఖాతాలను మూసి వేసి కరీంనగర్ నగరపాలక సంస్థ పేరుతో నూతన ఖాతాలను తెరవాలని సూచించారు. పూర్తిస్థాయి రికార్డులను స్వాధీనం చేసుకొని వచ్చే నెల 6లోగా పూర్తి వివరాలకు సీడీఎంఏకు నివేదికను అందించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వచ్చే వారం రోజుల్లోగా ఆయా గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీలో నగరపాలక సంస్థ పాలన మొదలు కానుంది.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

మేనేజర్ అమరావతిని సన్మానిస్తున్న సింగిల్ విండో చైర్మన్ బాలాగౌడ్

గంగాధర, జనవరి 28: ప్రజలకు ఉత్తమ సేవలు అందించడం ద్వారానే సమాజంలో గుర్తింపు వస్తుందని గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ అన్నారు. మండలంలోని కురిక్యాల కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సుమితా అమరావతి ఈ నెల 2న కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సింగిల్ విండో చైర్మన్ బాలాగౌడ్, సిబ్బంది మేనేజర్ అమరావతిని శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో కార్యదర్శి గాలిపెల్లి రమేశ్, సిబ్బంది శేఖర్‌రెడ్డి, సతీశ్, శ్రీనివాస్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కొత్తపల్లి/ హుజూరాబాద్ రూరల్, జనవరి 28: నూతనంగా వ్యవసాయ భూమి కొనుగోలు చేసి, పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు రైతు భరోసా కోసం ఈ నెల ఆఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారి ఎం కృష్ణ, హుజూరాబాద్ ఏఈవో సతీశ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జనవరి 1, 2025 ముందు పట్టాపాస్ పుస్తకం పొందిన రైతులు, తమ గ్రామ సంబంధిత ఏఈవోలకు వివరాలివ్వాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

- కలెక్టర్ పమేలా సత్పతి
- మహిళా డిగ్రీ కళాశాలలో ఆకట్టుకున్న ఫెరియా ఫీస్టా

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టాళ్లు పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, జనవరి 28 : ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతున్నదని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన 'ఫెరియో ఫీస్టా' సోషల్ సైన్స్ ప్రదర్శనలను కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులు ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణాన్ని సందర్శించేలా చూడాలని బాలికల అభివృద్ధి అధికారి కృపారాణిని ఆదేశించారు. ఈ ప్రదర్శనలను పెద్ద ఎత్తున జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు తిలకించారు. ఫన్ గేమ్స్, పజిల్స్, మెదడుకు మేత వంటి వివిధ ఆటలు విద్యార్థులను ఆకర్షించాయి. ఈ సందర్భంగా కళాశాలలో మెడ్ కవర్ హాస్పిటల్ సౌజన్యంతో హెల్త్ క్యాంపు నిర్వహించారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం తరపున విద్యార్థినులు 40 రకాల వంటకాలతో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థినులకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించగా, విజేలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డీ వరలక్ష్మి అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ టీ భాగ్యలక్ష్మి, ఎన్సీసీ డాక్టర్ లెఫ్టినెంట్ ఆయేషా షేక్, ఫెరియా ఫీస్టా కన్వీనర్ డాక్టర్ ఆర్ మొగిలి, కోఆర్డినేటర్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలి

కార్పొరేషన్/ కలెక్టరేట్, జనవరి 28 : భూక్రమబద్ధీకరణ పథకంలో పెండింగ్‌లో ఉన్న 2020 దరఖాస్తులు వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులపై నీటిపారుదల, పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దరఖాస్తులు అధికంగా ఉన్న గ్రామాల్లో అదనపు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్, రూరల్, కొత్తపల్లి మున్సిపాలిటీ, కొత్తపల్లి మండల పరిధిలోని దరఖాస్తులు పరిశీలించేందుకు అదనంగా తొమ్మిది మంది సిబ్బందిని కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

'దిశ' శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌చౌరస్తా, జనవరి 28 : జిల్లా వ్యాప్తంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దిశ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ సప్తగిరి కాలనీలోని కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ పాఠశాలలో కొనసాగుతున్న దిశ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కమాన్‌చౌరస్తా, జనవరి 28: శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో నూతనంగా కొనుగోలు చేసిన 15 కంప్యూటర్లను వీసీ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్, ఓఎస్డీ డాక్టర్ హరికాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాలలోని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జనవరి 28: నగరంలోని పలు ప్రాంతాల్లో ఏబీ స్విచ్‌ల పనులు చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ పీ శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గాంధీ చౌరస్తా, శర్మ నగర్, కార్ఖానాగడ్డ, హుస్సేనీపుర, అశోక్ నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులివ్వండి

చిగురుమామిడి, జనవరి 28: గౌరవెల్లి రిజర్వాయర్ కాలువల కింద భూములు కోల్పోతున్న రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు అందజేయాలని గౌరవెల్లి ప్రాజెక్టు ఎస్డీసి కిరణ్ ప్రకాశ్ సూచించారు. మండలంలోని ఉల్లంపల్లి, ఇందుర్తి, బొమ్మనపల్లి, చిగురుమామిడి గ్రామాల్లో రెండో విడుత గ్రామ సభలను రైతు వేదికలు, గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

దాడిని ఖండిస్తూ నిరసన

ముకరంపుర, జనవరి 28: అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, సిబ్బందిపై దాడిని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులు ఖండించారు. టీఎన్జీవోస్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సెంట్రల్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హమీద్ అలీ, కార్యదర్శి పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బీఫార్మసీ విద్యార్థిని అనుమానాస్పద మృతి!

సుబేదారి, జనవరి 28 : హనుమకొండలో బీ ఫార్మసీ విద్యార్థిని మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన సాయి చంద్రిక నయీంనగర్‌లోని ఓ కళాశాలలో బీ ఫార్మసీ సెకండ్ ఇయర్ చదువుతున్నది. ఈ నెల 26న అదే కళాశాల హాస్టల్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించగా, తోటి విద్యార్థులు గమనించి యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో నగరంలో ప్రైవేట్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. కాగా, చికిత్స పొందుతూ విద్యార్థిని మంగళవారం చనిపోయినట్లు తెలిసింది. ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యం గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తున్నది. సమాచారం తెలిసిన విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలకు వచ్చి ఆందోళనకు దిగారు. చంద్రిక మృతిపై సమగ్ర విచారణ జరిపి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, విద్యార్థిని చంద్రిక మృతిపై అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్స్పెక్టర్ సతీశ్ తెలిపారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

తెలంగాణచౌక్, జనవరి 28: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో నైపుణ్యగల డ్రైవర్లతోనే ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణం కొనసాగిస్తున్నారని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం పేర్కొన్నారు. బస్టాండ్ ఆవరణలోని డిపో-2లో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా రవాణా అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్ఎం రాజుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీటీవో ఆర్టీసీ డైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, భద్రత ప్రమాణాలను పాటిస్తూ వాహనాలను నడిపించాలని సూచించారు. అనంతరం ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించి, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, డీఎంలు మల్లయ్య, విజయమాధురి, పర్సనల్ మేనేజర్ చంద్రయ్య, రీజియన్ పరిధిలోని 11 డిపోల డీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ కార్మికులకు సన్మానం

కార్పొరేషన్, జనవరి 28: నగరంలోని 60వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది, ఇతర విభాగాల సిబ్బందికి మంగళవారం సాయంత్రం స్థానిక కార్పొరేటర్ వాల రమణారావు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరయ్యారు. తమ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ఇంతకాలం తన డివిజన్‌లో సేవలందించిన కార్మికులను సన్మానించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

స్వధార్ హోం సందర్శన

కలెక్టరేట్, జనవరి 28: నగరంలోని స్వధార్‌హోం, ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమం, వికలాంగుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులు, దివ్యాంగులతో కలిసి ముచ్చటించారు. వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. స్వధార్ హోం సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వారి వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు ఆయాచోట్ల పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వధార్ హోం సిబ్బందితో పాటు ఆయా ఆశ్రమాల సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జ్యూట్ బ్యాగ్‌ల పంపిణీ

విద్యానగర్, జనవరి 28: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థ 18, 19వ డివిజన్లలో పనిచేస్తున్న 40 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు మంగళవారం జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. గోల్డెన్ శాతవాహన అధ్యక్షుడు మానవాడ శంకర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకుండా పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవీ కృష్ణాగౌడ్, 19వ డివిజన్ కార్పొరేటర్ లయన్ ఏదుల్ల రాజశేఖర్, గోల్డెన్ శాతవాహన కార్యదర్శి లయన్ ననువాల గిరిధర్ రావు, కోశాధికారి లయన్ కుంబోజు రమేశ్, ఇన్నర్ కాబినెట్ లయన్ గుంటుక చంద్రప్రకాశ్, లయన్ గాలిపెల్లి వెంకట్, లయన్ పవనసుత రాజు, చార్టర్ ప్రెసిడెంట్ లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ పాశం నర్సింహారెడ్డి, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ చిలుపూరి రాములు, సభ్యులు లయన్ గోనె చంద్రారెడ్డి, లయన్ బండారి గంగాధర్, లయన్ ఆరెపల్లి సంపత్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ మండల నూతన కమిటీలు

వీణవంక, జనవరి 28: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. డీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా కనకం శ్రీనివాస్ (ఎస్జీటీ, ఎంపీపీఎస్ ఎలుబాక), ప్రధాన కార్యదర్శిగా వెంకటన రసింహారెడ్డి (జడ్పీహెచ్ఎస్, ఎలుబాక) ఉపాధ్యక్షులుగా ఎం లింగయ్య, గంటల మాధవి, ఎన్.వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శులుగా గూటం ఉమారెడ్డి, పత్తి రాజు, సురేశ్‌బాబు, వి.శాంతమ్మ, ఆడిట్ కన్వీనర్లుగా ఎల్.శ్రీనివాస్, ఆకుల చంద్రశేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పి.సంపత్‌రెడ్డి, చంద్రమౌళి, రాజేందర్ , రాజు ఎన్నికయినట్లు జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి జిల్లా కార్యదర్శి ఏబూసి శ్రీనివాస్ తెలిపారు.

హుజూరాబాద్ రూరల్, జనవరి 28: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, జిల్లా కౌన్సిలర్ ఏబూషి శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా విజయ, రాజేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బేతి తిరుపతిరెడ్డి, కార్యదర్శులుగా విక్రమ్, కరుణశ్రీ, వీరన్న నాయక్, జిల్లా కౌన్సిలర్లుగా పలకల ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, శ్రీరామ్ చక్రధర్, అల్లి శ్రీనివాస్, వెంకట్రాజం, ఉయ్యాల శంకర్, చంద్రగిరి మల్లేశం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ముషం సత్యరాజం, కార్యవర్గ సభ్యులుగా ఆంజనేయులు, భాస్కర్ ఎన్నికయ్యారు.

'కాంగ్రెస్‌ది చేతకాని పాలన'

వీణవంక, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలనా.. చేతకాని పాలనో ప్రజలకు అర్థం అవుతున్నదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి అప్పని హరీశ్‌వర్మ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నయవంచన చేసిందని దుయ్యబట్టారు. గ్రామసభలతో ప్రజల మధ్య గొడవలు పెడుతున్నారని, ఒక గ్రామాన్ని ఎంపిక చేసి తూతూమంత్రంగా పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుభరోసా సాయం అందరికీ అందుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి 48 గంటలు దాటినా.. రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడం సిగ్గుచేటన్నారు. మాయమాటలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నదని, ఇది రైతువ్యతిరేక సర్కారుగా చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వొల్లా శ్రీకాంత్‌గౌడ్, రాపర్తి అరవింద్‌గౌడ్, యార సుమన్, కుందె హరీశ్, అఖిల్, నరేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై లైంగికదాడికి యత్నం

జమ్మికుంట, జనవరి 28: ఆమె మానసిక దివ్యాంగురాలు. అలాంటి మహిళపై ఓ మృగాడు లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మికుంటలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పట్టణ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అతడి ఇంటికి వేల్పుల రాజేశ్ అనే వ్యక్తి వచ్చి బ్రాండీ షాపునకు వెళ్లి మద్యం తీసుకురావాలని అతడిని పంపించాడు. ఇదే అదునుగా భావించిన రాజేశ్ ఆ వ్యక్తి భార్య అయిన దివ్యాంగురాలిపై లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

చెరువు శిఖంలో నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శంకరపట్నం, జనవరి 28: చెరువు శిఖం, పల్లె ప్రకృతి వనం స్థలంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణంపై గొల్లపల్లి గ్రామానికి చెందిన కాసు రాజ్ కుమార్ అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11న గొల్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శంకుస్థాపన చేశారని, ఆ స్థలం చెరువు శిఖంలో ఉందని, అంతేగాక, గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన నర్సరీ ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జీపీ భవనాన్ని ఎలా నిర్మిస్తారని అన్నారు. ఈ మేరకు తాను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

మహిళ మృతదేహం గుర్తింపు

గంగాధర, జనవరి 28: మండలంలోని కురిక్యాల కొండన్నపల్లి గ్రామాల మధ్య వరదకాలువ వద్ద ఓ మహిళ మృతదేహం లభించగా, మృతురాలిని మంచిర్యాలకు చెందిన మమతగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. మహిళను హత్య చేసి మృతదేహాన్ని వరదకాలువ వద్ద పడవేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్ఐ నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ కొనసాగుతున్నదని, త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

సిల్వర్ ఫిలిగ్రీని సందర్శించిన ఏఎస్‌సీఐ శాస్త్రవేత్తలు

కమాన్‌చౌరస్తా, జనవరి 28 : కరీంనగర్‌లోని సిల్వర్ ఫిలిగ్రీ క్లస్టర్‌ను ఏఎస్‌సీఐకి చెందిన శాస్త్రవేత్తల ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. కరీంనగర్‌లోని సిల్వర్ ఫిలిగ్రీ 2007లో జీఐ గుర్తింపు పొందగా, ఇక్కడ సిల్వర్ ఫిలిగ్రీ తయారు చేస్తున్న కళాకారులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి ఫిలిగ్రీ ఉత్పత్తుల గురించి కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ అసోసియేషన్ సొసైటీ అధ్యక్షుడు అశోక్, వెంకటేశ్, అశోక్ కుమార్ వివరించారు.

సదరం క్యాంపుల షెడ్యూల్ విడుదల

విద్యానగర్, జనవరి 28: ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించే సదరం క్యాంపు తేదీలను విడుదల చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గుండా వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 3, 4న ఆర్థో, 6న మానసిక రోగులు, 10న కంటిచూపు ,13న వినికిడి, మూగ, చెవుడు, మార్చిలో 4న ఆర్థో, 11న మానసిక రోగులు, 18న కంటిచూపు, 24న వినికిడి, మూగ, చెవుడు నిర్ధారణ పరీక్షల కోసం క్యాంపులు కొనసాగుతాయని వెల్లడించారు. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకొని వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికి రిజిస్టర్ అయిన మొబైల్ నంబర్‌కు సందేశం వస్తుందని, ఫోన్ మెస్సేజ్ ప్రకారం సదరం క్యాంపునకు హాజరుకావాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ గడువు ముగిసిన వారు (రెన్యువల్) ఈ నెల 29న ఉదయం 11:30 నుంచి మీ సేవలో బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

మొగిలిపాలెం ఆలయాల్లో చోరీ

తిమ్మాపూర్, జనవరి 28: మొగిలిపాలెం గ్రామంలోని మూడు ఆలయాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలోని పోచమ్మ గుడి, రేణుకా ఎల్లమ్మగుడి, పెద్దమ్మ గుడి ఆలయాల్లో గ్రామస్తులు నిత్యం పూజలు చేసి కానుకలు సమర్పిస్తారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వెళ్లిన భక్తులకు తాళాలు పగులగొట్టి కనిపించాయి. కమిటీ సభ్యులు వెళ్లి చూడగా పోచమ్మ ఆలయంలో అమ్మవారికి అలంకరించిన రూ.50వేల విలువైన బంగారు ముక్కుపుడుక, కండ్లు, రేణుకా ఎల్లమ్మ గుడిలో హుండీలోని రూ.50వేలు, పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి అలంకరించిన రూ.లక్ష విలువైన వెండి కండ్లు, బంగారు పుస్తెలు కనిపించలేదు. ఈ మేరకు ఆలయాల కమిటీ బాధ్యులు బుధవారం ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట, జనవరి 28: మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన రఫత్‌కు మహబూబ్‌తో వివాహమైంది. పెళ్లైన కొన్ని సంవత్సరాలకు భర్త మృతి చెందాడు. ఇటీవల ఇంటి పక్కనే ఉన్న సమీర్ అనే వ్యక్తి వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలు రఫత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమీర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

కరీంనగర్‌ను టీబీ ముక్త్ జిల్లాగా మార్చాలి

కరీంనగర్ రూరల్, జనవరి 28: ప్రతి గ్రామంలో అందరూ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, కరీంనగర్‌ను టీబీ ఫ్రీ జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కేవీ రవీందర్ రెడ్డి సూచించారు. మంగళవారం కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, గన్నేరు వరం, మండలాల పంచాయతీ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కరీంనగర్‌ను టీబీ ముక్త్ జిల్లా మార్చేందుకు అన్ని డిపార్ట్‌మెంట్లు సహాయ సహకారాలు అందించాలన్నారు.

పాలకవర్గ వీడ్కోలు సమావేశం..

పౌరసేవలకు అంతరాయం!

కార్పొరేషన్, జనవరి 28: పాలకవర్గ వీడ్కోలు సమావేశం జరిగితే ప్రజలకు నగర పాలక సంస్థ అందాల్సిన సేవలను నిలిపివేస్తాం అన్నట్లుగా వ్యవహరించారు నగర పాలక అధికారులు. మంగళవారం ఉదయం నుంచే నగరపాలక సంస్థ కార్యాలయం లోకి ప్రజలెవరినీ అనుమతించకుండా పోలీసులకు నగరపాలక అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇ